# గంపెడు గడ్డి

బడికి పోతున్నాను సైకిల్ మీద.

పసలకుంట దాటి, అయ్యగారి కుంట మీదుగా వెళ్తూ అలవాటుగా రోడ్డుకు ఉత్తరం దిక్కునున్న మా కుంటపక్కా, కుంట కింది చేలపక్కా చూశాను.

పచ్చటి రాగిపైరులో రెండు మూడు రంగుచీరలు – వంగుతూ లేస్తూ...

గబగబ సైకిల్ తొక్కుతూ మా చేలకు సరిగ్గా వెళ్లి, కాలి దారిగుండా జ్యోతివాగులోకి దిగి, సైకిల్‌ను ఇసుకలో స్టాండేసి, బిరబిర మా బావికాడికి పోయేసరికి – గడ్డి గంపలు నెత్తికొత్తుకొని చేలు దాటారు వాళ్ళు.

గడ్డి దొంగలు తప్పించుకుపోయారు. కేకలేసి తిట్టినా నోరు నొప్పి తప్ప లాభముండదు. వీళ్ల పోరు భరించరానిదిగా ఉంది.

చేలగెట్ల మీద అనలు కొనలుగా పెరిగిన గడ్డిని ఏదోక జామున దొంగతనంగా కోసుకుపోతున్నారు. ఏ గెట్టుచూసినా కాట్లుకాట్లుగా తెగిన గడ్డి మొదళ్ళు తొర్రినోటి పాపల్లా నన్ను చూసి వెక్కిరిస్తున్నాయి.

పగటిపూట ఎప్పుడోకసారి గంప చంకనేసుకొని చేనికాడికొస్తుంది ఇందిర. అక్కడ వంగి, ఇక్కడ లేచి, ఆ పక్క బరికి ఈ పక్క పెరికి గంపనిండా గడ్డి కోసుకుంటుంది. సాయంత్రం నామీద 'గయ్'మని లేస్తుంది.

మా వూరికి రెండు కిలోమీటర్ల దూరంలోని పాపిరెడ్డిపల్లెకు ట్రాన్స్‌ఫరయి నాకీ అగచాట్లు వచ్చాయి. రోజూ రేపటేల మాపటేల ఆ దోవన వస్తూ, పోతూ కూడా గడ్డి దొంగల్ని పట్టుకోలేని నా చేతగాని తనమ్మీద ఇందిర ఎత్తిపొడుపుల్ని వినలేకపోతున్నా.

నేను నిర్ణయం తీసుకున్న తర్వాత నాలుగు రోజులు కన్పించలేదు వాళ్ళు.

నా ప్రయత్నాల్ని పసిగట్టారేమోనని అనుమానం కలిగింది.

ఇందిర మాత్రం నసపెట్టటం చాలించలేదు, గెట్లమీద గాట్లు ఆగలేదని.

గడ్డి దొంగలు నన్ను ఏమార్చుతున్నారు.

బాగా ఆలోచిస్తే నేనెక్కడ తప్పటడుగులు వేస్తున్నానో అర్థమైంది.

నా ప్రయాణంకంటే ముందే వాళ్ళు గడ్డికోసుకుపోతూండాలి. లేదా – మా చేలకేసి చూసేందుకు అయ్యగారి కుంట నాకెంత అనుకూలమో, నా ఉనికి పసిగట్టేందుకు వాళ్ళకూ అంతే అనుకూలమవటం వలన తప్పించుకు పోతున్నారు కాబోలు.

దొంగల పోకడకు సంబంధించిన ఆధారం ఒకటి దొరికింది.

ఉదయమే హుషారుగా లేచాను.

గంట ముందుగా ప్రయాణమయ్యాను.

అయ్యగారి కుంట దారి విడిచి కాలిదోవగుండా జ్యోతివాగు జేడిల్లో నక్కినక్కి నడుస్తూ మా కుంట పొలిమేరలు తొక్కాను. తుమ్మ చెట్ల చాటున్నించి సాగిపోతూ మాచేల గెట్లవద్ద హఠాత్తుగా బైటబడే కాలిదారి మీదుగా జాగ్రత్తగా నడిచాను.

ఒక్కసారిగా నేను చేనిగట్టున ప్రత్యక్షమయ్యేసరికి చేలోని ఆడాళ్ళు ముగ్గురూ ఆశ్చర్యం నిండిన కళ్ళతో నిటారుగా నిల్చున్నారు.

క్షణంలో తేరుకొని ఇద్దరు ఆడాళ్ళు మాత్రం గాభరాగా చేలోంచి బైటకొచ్చి అప్పటిదాకా కోసిన గడ్డిని గంపల్లో దూర్చసాగారు.

మూడవ ఆడమనిషి మాత్రం నాకేసి ఓసారి అదోలాచూసి మళ్ళీ గడ్డికోసేందుకు వొంగింది.

నాకు మండిపోయింది.

దొంగతనంలో కూడా లెక్కజేయనితనాన్ని భరించలేకపోయాను.

ముగ్గుర్ని కలిపి చీవాట్లేశాను.

గంపలు భుజాన పెట్టుకొని ఇద్దరు ఆడాళ్ళు చేను దాటారు గాని, మూడవ మనిషిమాత్రం నన్ను జమచేసినట్టులేదు. బైటకెళ్ళటం ఇష్టం లేనట్లుగా మందగమనంతో అడుగులేసింది.

గొంతు పెంచి అదిలిస్తూనే వాళ్ళకేసి పరిశీలనగా చూశాను. ముందు వెళ్ళిన ఇద్దరూ ముప్ఫైయేళ్ళకు పైబడ్డవాళ్లే. వెనుక యువతికి మాత్రం పాతికేళ్ళలోపే ఉంటాయి. అందంగానే ఉంది.

మరోసారి చేలో కన్పిస్తే గంపలు లాక్కెళతానని హెచ్చరించాను.

ఆ యువతి ఓసారి వెనక్కి తిరిగి నాకేసి చూసింది. ఆమె మొహంలో పరిహాసరేఖలు అస్పష్టంగా కన్పించాయి. నా మాటల్ని ఖాతరు చేసినట్లులేదు.

నేనింతగా మందలించాను గదా – మాచేలల్లోకి రారనుకొన్నాను. అయినా సరే – మళ్ళీ రోజు అడ్డదారిన్నే కుంటవద్దకొచ్చాను. చేలోకి చూద్దును గదా – చిలకపచ్చరంగు చీరలో ఆమె. కోపం రవరవ తన్నుకొచ్చింది నాకు.

"బుద్ధుందా లేదా నీకు? చేలమీదబడి యిష్టమొచ్చినట్టు గడ్డి గోస్తే – మాకూ బరుగొడ్లుండాయి గదా! మేమేం సావు జావాల?" అన్నాను గొంతు పెంచి.

కొడవలి చేతితోనే లేచి నిలబడింది ఆమె.

"ఈ గడ్డెంతా ఏం జేసుకుంటారు సారూ?" అంది నెమ్మదిగా.

"ఆ చేలో పిడికెడో, ఈ గెట్టున కనికెడో కోసప్పోకుంటే మా బరుగొడ్లు మాత్రం ఎట్టా బతకాలా?"అంటూ మళ్ళీ గడ్డి కోతకు వంగింది. ఆమె లెక్కలేనితనమ్మీద నాక్కోపం పెరిగిపోతోంది.

ఏమనేందుకు ఆడమనిషి.

ఇందిర చెప్పినట్లు చేతి కొడవలిని లాక్కోవాలనిపించింది గాని సభ్యత అడ్డొచ్చింది.

"పోతావా గంప దీసుకోమంటావా? నాగ్గాని కోపమొస్తే... కోసిన గడ్డిగూడా నీకు దక్కదు. ఆ..." గద్దించాను గెట్టుమీంచే.

నా మాటల్లోని కరుకుదనం ఆమెపైన ఏమాత్రం ప్రభావం చూపినట్టులేదు. మరికొంతసేపు గడ్డికోసుకుంటూ, గంపలో దూర్చుకొంటూ అక్కడక్కడే తేనె పిట్టలా మల్లాడుతూ దారిబట్టింది. నాలుగడుగులు వేసింతర్వాత నాకేసి ముసి ముసి నవ్వుల్లో చూస్తూ మళ్లీ వంగింది.

"మొండి మనిషి... పోపో... యింకపో..." అరిచాను.

నవ్వుకొంటూ వంగుతూ లేస్తూ గడ్డి పీక్కొంటూ చేలు దాటింది ఆమె.

పొద్దు తిరుగుడు కంకుల మీద వాలే చిలకను అదిలించినట్లే వుంది నా పరిస్థితి.

ఆమె ఎవరో చాలా మొండిదానిలాగుంది.

మరో నాలుగు రోజులపాటు ఇదే అవస్థ అయింది నాకు. నేను వెళ్ళేసరికి చేలో సిద్ధంగా ఉంటుంది. ఏమనేందుకు పాలుపోక తలపట్టుక్కూచున్న నన్ను చూసి నవ్వుకొంటుంది.

"నీసొమ్మేంబోలేదులే సారూ! నేను పీక్కపొయ్యేది గెట్లమీద గడ్డిపోచలే లే! పైరుగాదు గానీ..." అంటుంది.

ఆమెకేం తెలుసు? – తను కోసి వదలే ప్రతిగడ్డి మొదలూ నన్నో చేతగాని వాన్నిగా నా శ్రీమతి ముందు నిలబెడతుందని. నేను విసుక్కొని కోపాన్ని ప్రదర్శించినపుడు గానీ చేలు దాటదు. ఆమె బెడద ఎట్ల వదిలించుకోవాలో అర్థం కాకుండాఉంది.

అందంగా ఉంటుంది.

పైరుమీద వాలే రామచిలుకలాగే ఉంటుంది.

ఆమెను మా చేలోకి రాకుండా చేయలేకున్నా.

వచ్చినదాన్ని గెట్టు దాటించేందుకు సైతం ఎన్నెన్నో అగచాట్లు పడుతున్నా.

అందమైన ఆడమనిషిపట్ల మగాడికున్న సహజ బలహీనతవల్లే నేనామెపట్ల కఠినంగా వ్యవహరించలేకున్నానేమో!

ఇందిర దృష్టిలో చులకనగా చూడబడకుండా వుండాలంటే ఈ సమస్యను ఆమెకే అప్పగించటం మర్యాద.

మరుసటిరోజు ఆ పనే చేశాను.

గడ్డిదొంగల ఆచూకీ గురించి ఆమెకు ఉప్పందించాను.

ఇంటివద్దనుంచే ఆవేశపడుతూ గంప చంకన బెట్టుకొని వీరనారిలా బైల్దేరింది ఇందిర.

పెద్దపాప పావని సర్దిచెబితే విందిగాని, చిన్నపాప శ్రావణి మాత్రం అమ్మకొంగు వదల్లేదు.

"మీ అమ్మ యాడికి పోతాందని ఎంటబడ్తాండావు? యుద్ధానికి తల్లీ! యుద్ధానికి పోతాంది. మీరు కాళ్ళు సేతులకు అడ్డుపడ్తే ఎట్టా" అంటూ శ్రావణిని సముదాయించి, కొంగు వదిలించి అమ్మకు అప్పగించాను.

మా కుంటదాకా ఇందిరతో కలిసే వెళ్ళిన నేను అక్కడ వెనక్కి తగ్గి చెట్ల చాటుగా నిల్చున్నాను.

నా శ్రీమతి, ఒక ఉపాధ్యాయుని భార్య, అట్లా నోరు చేసికొంటుందని నేనూహించలేదు. నోటితో కూడా ఇంత సమర్థవంతంగా యుద్ధం చేసే కళ ఆమె ఎప్పుడు నేర్చుకుందో నాకు అంతుబట్టలేదు.

తిడుతూనే ఆమెపైకి వెళ్లింది ఇందిర.

కొడవలి లాక్కొని విసరేసింది. గంపలో గడ్డిని ఎత్తి తన గంపలో గుమ్మరించుకొంది. ఖాళీ గంపను దూరంగా దొర్లించింది. ఇంకోసారి చేలో కన్పిస్తే చెప్పుతో కొడతానంటూ హెచ్చరించింది.

నా అంత ఘోరంగా కాకున్నా చివరకు ఇందిర కూడా ఫెయిలవుతుందను కొన్నానుగాని, యింత ఘనవిజయం సాధిస్తుందని వూహించలేకపోయాను. కృష్ణుడితో కానిపని సత్యభామ చేసిందంటే చచ్చినట్లు నమ్మాల్సిన పరిస్థితి.

చెట్టు చాటునించి నేను గట్టు మీదకొచ్చాను – గడ్డి దొంగ మొహంలోని భావాల్ని చదవాలని.

కొడవలిని వెదకి తీసుకొని, వొట్టి గంపను రొండిన పెట్టుకొని చేను దాటిపోతూ పోతూ ఓసారి నాకేసి సూటిగా చూసింది ఆమె.

నాకు తెలీకుండానే నాలో ఏదో తడబాటు.

ఆ చూపు నన్ను రోజంతా విడిచిపెట్టలేదు.

సన్నగా ఎక్కడో కాల్చుతూ ఉన్నట్లే అన్పించింది.

బహుశా మరెప్పుడూ ఆమె మా చేలల్లోకి అడుగు పెట్టకపోవచ్చు. మా కుంటకేసి కూడా కన్నెత్తి చూడక పోవచ్చు.

మర్నాటినుంచి చేలకేసి కూడా తలతిప్పకుండా ధీమాగా బడికి వెళ్ళి వస్తున్నాను.

మూడురోజుల తర్వాత సాయంత్రం బడినించి యింట్లో అడుగుపెట్టగానే ఇందిర 'గెయ్'మని లేచింది "పొద్దున ఆ దోవన్నే, పైటేల ఆ దోవన్నే, మాపిటేల ఆ దోవన్నే....బుర్రున పోడం...రాడం... సేనుపక్క సూసేందుక్కూడా ఓపికుండదేమో మారాజుకు?" అని.

ప్రశ్నార్థకంగా ఆమెకేసి చూశాను.

"మల్లా ఆ దొంగనాసవతుల పోదు మొదలైంది మా రాజా!" చెప్పింది.

ఆశ్చర్యపోయాను.

అంత జరిగిన తర్వాత కూడా ఆమె తిరిగి మా చేలల్లోకి అడుగుపెట్టడాన్ని జీర్ణించుకోలేకపోయాను.

ఇక ఉపేక్షించదల్చుకోలేదు నేను.

మాటిమాటికి సైనిక సహాయం తీసికోవటం కూడా మంచిది కాదు.

ఈ సమస్యకు నేను శాశ్వత పరిష్కారం కనిపెట్టాలి.

ఆమె పట్ల కఠినంగా వ్యవహరించాలి.

మనస్సును గట్టిజేసుకున్నాను.

మరోసారి పరీక్షించి బాగా గరుగ్గా వుందనిపించగానే అదే ఆవేశంలో వూరు దాటాను.

అడ్డదారిన తోట వద్దకెళ్ళాను. కంపచెట్ల చాటున్నించి హఠాత్తుగా బైటకొచ్చి చేనిగెనిమ తొక్కి చూద్దును గదా– ఆమె కన్పించింది హుషారుగా గడ్డి పెరుక్కుంటూ.

పైరును పోదోస్తూ గెట్టెంట నేరుగా ఆమె వద్ద కెళ్ళాను.

నన్ను చూస్తూనే అందంగా నవ్వింది.

"ఛీ... నీకస్సలు సిగ్గే లేదు" అన్నాను.

మరోసారి అల్లరిగా నవ్విందామె.

ఏమారితే నా హృదయం జారిపోయేట్లుంది. కఠినత్వం కరిగిపోయేట్లుంది. ఆమె నవ్వుల మైకంలో పడి కర్తవ్యాన్ని మరిచిపోయేట్లున్నాను.

ఈ సమస్యకు ఇందిర చూపిన పరిష్కారమే సరైందిగా నా మనస్సులో బలంగా నాటుకొన్నట్లుంది.

"మాటల్లో చెబితే నువ్వు మర్యాదగా వినేట్టులేవు..." అంటూ రెండంగల్లో ఆమెను సమీపించి విసురుగా గంపను పైకెత్తి బోర్లించబోయాను.

వెంటనే అడ్డుపడింది ఆమె.

గంపను మరోవైపు పట్టుకొని పెనుగులాడింది.

ఆ గొడవలో పొరబాటున ఆమె కాలు తొక్కాను. వెంటనే స్పర్శ అర్థమై కాలు వెనక్కి తీసుకొన్నాను. అపరాధభావం ఉవ్వెత్తున ఎగసివచ్చి చేతుల్లో గంపను వదిలేశాను. అనుకోని సడలింపుకు వెనక్కి తూలింది ఆమె. గెనిమ మీద పడబోతూ కూడా గంపను తొడలమీద నిలుపుకొంది.

ఆదరాబాదరా లేచి కూచుని నాకేసి చూడకుండానే కింద రాలిపడిన గడ్డి పోచల్ని యేరుకొని గంపలో తురుముకుంది.

లేచి నిల్చుని, గంప తలపైకి ఎత్తుకొంటూ విశ్వాసం కోల్పోయిన చూపునొకదాన్ని నా కళ్ళల్లోకి గుచ్చింది. మెల్లిగా అక్కన్నించి బావి వద్దకు నడిచింది.

ముందుగానే విరిచిపెట్టుకొన్న కొద్దిపాటి ఎండుపుల్లల్ని గంపమీద పేర్చుకొని తిరిగి గంప తలకెత్తుకొనేందుకు సన్నద్ధమైంది.

అప్పటికే నేను ఆమెతోటి బావి వద్దకు వెళ్ళి ఉన్నాను. చేష్టలుడిగినవాడిలా కొంత దూరంలో నిల్చుని ఉన్నాను.

"మీ చేలల్లోకి యింగ రానులే సారూ!" అంది ఆమె తలొంచుకొని.

నాలో అపరాధ భయం ఇంకా మెలికలు తిరుగుతూనే ఉంది.

"ఎవురూ తరిమేవాల్లే... సిలకల్ను తరిమినట్టు... ఏ గెట్టుమీదా వొంగనియ్యరు. ఏ చేలో గడ్డి పెరకనియ్యరు. గంపెడు గడ్డి పెరక్కపోవాలంటే కన్నమేసి దొంగతనం జేసినంత కస్టమైతాంది...ఏ గెట్లమీదా గడ్డి తీసప్పోకుంటే మా బరుగొడ్డెట్టా బతకాల?" ఆమె గొంతులో కనిపించిన తడిజీర.

"మీ చేలల్లో యేమీ?" గొంతు సవరించుకొన్నాను.

"మాకు చేలుంటే మీచేత తిట్లదినే ఖర్మెందుకు పట్టుద్ది?" నాకేసి సూటిగా చూస్తూ అంది.

"చేలూ చెట్టూ లేనోల్లకు బరుగొడ్లెందుకో?"

నాకేసి వెర్రివాణ్ని చూసినట్లుగా చూసింది ఆమె.

"బర్రెల్లేకుంటే మేమెట్లా బతకాల?"అంది. "మీకు చేలుండయి... సర్కారు వుద్దోగముంది. బరుగొడ్లు లేకున్నే మీరు బతుకుతారు. మాకట్లాగాదు... మేం గొడ్లపాడిమీందే బతుకుతండాం..మా యింట్లో ముగ్గురు పెద్దోల్లనూ, వొగసంటోన్ని రొండుసిన్న బరుగొడ్లే సాకుతండాయి.... ఈ గంపెడు గడ్డి తీసప్పోకుంటే గొడ్లు పాలిచ్చేదిలే.... పాల్లేకుంటే సేతికి లెక్కొచ్చేదిలే... నేనూ, ముసల్దీ, పిల్లోడూ పస్తులైనా

వుంటాంగాని... వొక్కపూట తిండిలేకున్నా నా తిరుగుబోతు మొగుడు ఓర్చుకోలేదు సారూ!...." అంటూ గంప నెత్తికెత్తుకొంది.

"మాకు పొలాలున్నెయి. అవి కరిగి పోబట్టి అట్లా కూలికి పోలేక ఇట్లా బతుకుదెరువులేక యిప్పుడు బరుగొడ్ల మీందనే ఆధారపడాల్సొచ్చింది... ఆస్తెంత కరగదిన్నె ఆయప్పేమో గోడలకింద కూకొని బీడిముక్కలు పీల్చుకొంటా యవ్వారాలు జేస్చాంటాడు.... సంసారం సావంతా నాకొచ్చిపడింది సారూ!" ఆమె గొంతు జీరబోయింది.

"అందుకే... మీరు తిట్టినా రోసానికి పోకుండా మీ చేలల్లోనే గడ్డి కోస్చాండ..." మెల్లిగా వూరు దారి బట్టింది.

" నీ పెండ్లాం రోజూ సేలకాడికి రాదనీ, నువ్వు సూసినా సదూకున్నోనివి కాబట్టి వూరుకుంటావనీ అనుకొన్నే...నీ అరుపులకు బెదరి నాతోబాటు వొచ్చిన ఆడోల్లు సాలిచ్చినా నేను మానలే... ఎందుకంటే - నీమీద గురితోనే. నీపెండ్లాంతో తిట్టించినా నేను సాలించలే... ఎందుకంటే? - నీ మీంద నమ్మకంతోనే...నువ్వే నాపైకి కలబడేందుకొస్చే... మీ సేలల్లోకి నేనెందుకు అడుగుపెడ్తాను సారూ!" అంటూ వెళ్ళసాగింది ఆమె.

నాలో ఏదో అపరాధభావం...

నాకు తెలీకుండానే లోలోపల్నించి కమ్ముకొస్తోన్న వేదన. మరోసారి చేలో కన్పిస్తే ఆమె జోలికి వెళ్ళొద్దని మనస్సులో నా ప్రమేయం లేకుండానే తీర్మానం.

తర్వాత చాలా రోజులు నిరీక్షించాను - ఆమె మాచేలోకి గడ్డికి రావాలని.

మనసా వాంఛించాను - గంపెడు గడ్డి పెరక్కు పోవాలని. కాని ఆమె రాలేదు.

పక్క చేలల్లో తిట్ల తినయినా గడ్డి కోసుకెళ్లోంది గాని మా చేలల్లోకి అడుగు కూడా పెట్టలేదు.

నా కళ్ళక్కనిపిస్తూ కూడా మాచేలోకి పాదం మోపకుండా చాలాకాలంపాటు ఆమె నాకు మంచి శిక్ష వేసింది.

◆ మనభూమి - అక్టోబర్, **2005** ◆